నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జనవరి 10, 2024 | www.navatelangana.com


## జాతర కరపత్రాలను విడుదల చేసిన జెడ్పీ చైర్‌పర్సన్

**జైనూర్ :** ఈ నెల 12వ తేదీన లింగాపూర్ మండలంలో నిర్వహిస్తున్న జగదాంబ దేవీ మహా జాతరను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. మంగళవారం లింగాపూర్ మండలంలోని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్, వైస్ ఎంపీపీ ఆత్మారాం నాయక్, కోఆప్షన్ సభ్యుడు షేక్ సలీంతో కలిసి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగాపూర్ మండలంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగాపూర్ మండల వాసులు విజయ్ పాల్గొన్నారు.



## మోటార్ సైకిల్ అదుపుతప్పి రైతు మృతి

**కౌటాల :** మోటార్ సైకిల్ అదుపుతప్పి విజయనగరం గ్రామానికి చెందిన రైతు పొలిశెట్టి బాలస్వామి(48) మృతి చెందాడు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 6న కుటుంబీకులు హైదరాబాద్‌కు వెళ్లగా బాలస్వామి ఒక్కడే ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనులు చూస్తున్నాడు. శనివారం గుడ్లబోరి గ్రామ శివారులోని తన పొలానికి వెళ్తుండగా కల్వర్టును ఢీకొని రోడ్డు కింద పడిపోయాడు. రాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. కుటుంబీకులు ఫోన్ చేసిన ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి మంగళవారం కుటుంబీకులంతా హైదరాబాద్ నుండి గ్రామానికి వచ్చి వెతికారు. గుడ్లబోరి గ్రామ సమీపంలో కల్వర్టు కింద పడి మృతి చెందాడు. మృతుడి కుమార్తె ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



## స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం




నవతెలంగాణ - రెబ్బెన

మండల కేంద్రంలోని అన్నపూర్ణ హైస్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం స్కూల్ ముగిసిన తర్వాత 35 మంది విద్యార్థులతో బయలుదేరిన బస్సు ఇందిరానగర్ వద్ద పాఠశాల పిల్లలను దింపి జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్తున్న క్రమంలో ఆసిఫాబాద్ వైపు నుండి రెబ్బెన వైపు వస్తున్న లారీ(ఏపీ 16 టీఈ 7688) ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. బస్సు డ్రైవర్ ఇందిరానగర్ వద్ద యూటర్న్ తీసుకొని వెళ్లాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ రూట్‌లో వెళ్లడంతో లారీ బస్సును ఢీ కొట్టింది. బస్సులో ఉన్న 15 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ దందె సుధాకర్ రెండు కాళ్లు విరగడంతో చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి డ్రైవర్ రాంగ్ రూట్‌లో రావడమే కారణమని భావిస్తున్నారు.

## ముత్తడి స్ప్రింగ్ ఆయకట్ట మాజీ చైర్మన్ మృతి



నవతెలంగాణ - బెజ్జూరు

మత్తడి స్ప్రింగ్ ఆనకట్ట మాజీ చైర్మన్ కొట్రంగి పోసుమేర(90) సోమవారం రాత్రి మృతి చెందాడు. రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. 2001లో నీటి పారుదల ఎన్నికల్లో గెలుపొంది టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్తడి స్ప్రింగ్ ఆనకట్ట చైర్మన్‌గా ఆరు సంవత్సరాలు పనిచేశారు. మత్తడి అభివృద్ధి చేశారు. ఆయన మృతి పట్ల మండలవాసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ పరామర్శించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, మండల కోఆప్షన్ సభ్యుడు భశరత్‌ఖాన్, నాయకులు జావిద్ అలీ, సతీష్, భిక్షమయ్య నాహీర్ అలీ, మాలీ సంఘం అధ్యక్షుడు అశోక్, బీజేపీ నాయకులు భాస్కర్ రాజు, తిరుపతి ఉన్నారు.

## గురువుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ - జైనూర్

ఈ నెల 11వ తేదీన నిర్వహించబోయే గురువు మిలన్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ గణపతి నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో లంబాడీలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని శంకర్‌లొద్ది గ్రామం ప్రేమ్‌సింగ్ మహారాజ్ తపస్సు చేసిన స్థలమన్నారు. ఆ స్థలంలో 1979లో ప్రేమ్‌సాగర్ మహారాజ్ తపస్సు ప్రారంభించారని తెలిపారు. అందువల్ల గురువు మిలన్ దినోత్సవం సందర్భంగా బంజారా గిరిజనులు 11వ తేదీన అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి 11 రాష్ట్రాల నుండి భారీ ఎత్తున ప్రజలు వస్తున్నట్టు పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు సంస్కృతి సాంప్రదాయాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట బంజారా సంఘాల నాయకులు రాథోడ్ రాందాస్, జాదవ్ మోహన్, రాథోడ్ ధర్మేందర్, పండిత్ పాల్గొన్నారు.

## మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నస్పూర్

మున్నూరు కాపు సంక్షేమ సంఘం మంచిర్యాల, నస్పూర్ కోల్‌బెల్ట్ స్థాయి సర్వసభ్య ఆత్మీయ సమ్మేళనం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుందని సంఘం నస్పూర్ జిల్లా అధికార ప్రతినిధి బి.రాజేశం, యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి సురేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్నూరు కాపు సంఘం 2024 క్యాలెండర్ అవిష్కరణ అనంతరం ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశానికి ఎంఎల్సీ దండె విఠల్, మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారాం, జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, నస్పూర్ వైస్ చైర్మెన్ తోట శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ పల్లె భూమేష్ ముఖ్యఅతిదులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లపల్లి, తీగల్‌పహాడ్, సింగాపూర్, శ్రీరాంపూర్ ఏరియాలోని సభ్యులు, మున్నూరు కాపులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## విద్యార్థులకు ఇబ్బందులు

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మిషన్ కాకతీయ పైపులైన్‌కు మరమ్మత్తులు చేయడంతో రెండు రోజుల నుండి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జేసీబీతో మట్టి తవ్వడంతో మైదానం మొత్తం కుప్పలుకుప్పలుగా ఏర్పడి విద్యార్థులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మత్తుల పనులు పూర్తిచేసి ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యార్థులు కోరారు.

# పులి ప్రాణాలకు రక్షణేదీ..?

- గడిచిన నాలుగు రోజుల వ్యవధిలో రెండు పులుల మృత్యువాత
- విషం చల్లిన ఆవు కళేబరం తినే మృతి చెందినట్లు అనుమానాలు
- ఈ కళేబరాన్ని మొత్తం ఆరు పులులు తిన్నట్లు సీసీ కెమెరాలో రికార్డు?
- మిగిలిన పులుల కోసం అటవీ అధికారులు కూంబింగ్

**కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో గడిచిన నాలుగు రోజుల వ్యవధిలో రెండు పులుల కళేబరాలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వరుసగా రెండు పులులు మృత్యువాత పడడాన్ని రాష్ట్ర అటవీ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. దేశంలో, రాష్ట్రంలో పులుల సంతతి తక్కువగా ఉండడం, కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో పులులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని సంతతి పెరుగుతుండడంతో ఈ డివిజన్‌పై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. పులుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నారు. అయినా రెండు పులులు మృత్యువాత పడడం అధికారులను కలవరపరుస్తోంది.**



మృతి చెందిన పులిని ఖననం చేసిన స్థలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని దరిగాం ప్రాంతంలో ఆరు పులులు సంచరిస్తున్నాయి. ఇందులో ఎస్-9 మగ పులి కాగా, ఎస్-6 ఆడ పులి. వీటికి నాలుగు పిల్లలు ఉన్నాయి. ఇవన్నీ రెండేళ్లు దాటి పోయి ఉండడంతో ఇపుడిపుడే తల్లిదండ్రులను విడిచి స్వంతంగా వేట ప్రారంభిస్తున్నాయి. ఈ క్రమంలోనే అడవిలో వీటి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఈ ఆధిపత్య పోరులోనే ఒక రెండేళ్ల ఆడ పులి మృతి చెందగా, తాజాగా ఎస్-9 అనే తండ్రి పులి మృతి చెందింది. ప్రస్తుతం కేవలం తల్లి పులితో పాటు మూడు పిల్లలు సంచరిస్తున్నాయి. వీటి కదలికలు కూడా అటవీ అధికారులకు ప్రస్తుతం చిక్కడం లేదు. ఈ రెండు పులుల మృతికి ముందు ఈ ప్రాంతంలోనే ఒక ఆవును పులి హతమార్చింది. దీని కళేబరాన్ని మొత్తం ఆరు పులులు తిన్నట్లు సీసీ కెమెరాలో రికార్డయినట్లు తెలుస్తోంది. ఆవు కళేబరంపై విష ద్రవం చల్లితే మొత్తం ఆరు పులులు మృతి చెందాలి. కాని ఇందులో ఎస్-9 ఒక్కటే విష ద్రవంతో మృతి చెందినట్లు అనుమానాలను అధికారులు వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన ఆవు కళేబరంపై విష ద్రవం ఉన్నా అది అంత ప్రభావవంతంగా లేదని, దీనితో పులులు మృతి చెందే అవకాశాలు లేవని అధికారులు నిర్ధారిస్తున్నారు. మరి ప్రస్తుతం విషం కారణంగా మృతి చెందిన పులిపై ఎక్కడ విష ప్రయోగం జరిగిందనేది అనుమానమే. ఆరు పులులలో రెండు మృతి చెందగా, మిగిలిన నాలుగు పులులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాయా లేదా అనేది కూడా తెలియడం లేదు. సాధారణంగా వాచర్లు క్రమం తప్పకుండా అడవిలో తిరుగుతూ పులి కదలికలను గమనిస్తుంటారు. ప్రస్తుతం మిగిలిన నాలుగు పులుల జాడ కనిపించకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం పులులు మృతి చెందిన ప్రాంతానికి చుట్టు పక్కల మూడు కిలోమీటర్ల మేర మిగిలిన పులుల జాడ కోసం అటవీ అధికారులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

**పంచనామా అనంతరం ఖననం**

కాగా మృతి చెందిన రెండో పులికి పంచనామా నిర్వహించిన అనంతరం దానిని అక్కడే ఖననం చేశారు. పశు వైద్యాధికారులు విజయ్‌కుమార్, శ్రీకాంత్, రాకేష్‌లు ముందుగా పులి నుండి శాంపిళ్లు సేకరించారు. అనంతరం వీరి సమక్షంలోనే అటవీ అధికారులు వాటిని ఖననం చేశారు. పది రోజుల క్రితం పులి హతమార్చిన ఆవు నుండి కూడా మంగళవారం అధికారులు శాంపిళ్లు సేకరించారు. అనంతరం దానిని కూడా అక్కడే ఖననం చేశారు.



పులి హతమార్చిన ఆవును ఖననం చేసిన అటవీ అధికారులు



నాలుగు పులి పిల్లలతో తల్లి పులి (ఫైల్)

## వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేష్
- నేడు జిల్లా ప్లీనం
- ముఖ్యాతిథులుగా రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ, బండారు రవికుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. జిల్లా అభివృద్ధిపై పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్లీనం సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీన్ని జయప్రదం చేయాలని కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. సీసీఐని పునఃప్రారంభించాలని, ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ పూర్తి చేయాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో విమానాశ్రయాన్ని నిర్మించాలని, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని, మాంగనీస్ ఆధారిత ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని, కేంద్రీయ విద్యాలయ నిర్మాణ పనులు అడ్డుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభించాలని, భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని అన్నారు. ఆధార్ సెంటర్లు మండలానికి రెండు చొప్పున ఏర్పాటు చేయాలని, ప్రజల అవస్థలు తీర్చాలని తెలిపారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. బుధవారం జరిగే ప్లీనం సమావేశంలో తీర్మానాలు చేసి వాటి అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా, సామాజిక సంఘాలను కలుపుకొని పోరాడుతామని పేర్కొన్నారు. సుందరయ్య భవనంలో నిర్వహించే ప్లీనం సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి బండారు రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల పాల్గొన్నారు.




## సంఘం ఆధ్వర్యంలో పోరాడి హక్కులను సాధిద్దాం

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వైద్య శాంతికుమారి

నవతెలంగాణ - జైనూర్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోరాడి ఉపాధ్యాయ సమస్యలను, హక్కులను సాధించడం కోసం కలిసికట్టుగా ముందుకెళ్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. మంగళవారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల టీఎస్‌యూటీఎఫ్ సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు నిరంతరం పోరాడుతోందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల పక్షంలో సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాలను ఆపేదిలేదని తెలిపారు. జీఓ 317 బాధితుల కోసం గురుకులాలు, కేజీబీవీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు సీపీఎస్‌ను రద్దు, యూపీఎస్‌ను అమలు చేయాలని వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం మూడు మండలాల కమిటీలు వేయడంతో పాటు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కుడిమెత సుధాకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం జాదవ్ మధూకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందూరావు, కార్యదర్శి కొట్నాక మోపత్‌రావు, నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.




## పీవీటీజీల ఆధార్ నమోదు త్వరగా పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ - జైనూర్

కొలాం గిరిజనుల కోసం చేపడుతున్న పీవీటీజీల ఆధార్ నమోదు కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించి త్వరగా పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం లింగాపూర్ మండలంలోని ముల్లగూడ గ్రామంలో ఆయన పర్యటించి ఆధార్ నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రంలో ఎలాంటి నిర్లక్ష్యం జరుగకుండా త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. మండలంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ముల్లగూడ గ్రామంలో హెల్త్ క్యాంప్‌ను పరిశీలించారు. సికిల్‌సెల్, అనీమియా వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ హెల్త్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిర్పూర్(యు) ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీఓ ఉమర్‌షెరీఫ్, కంచన్‌పెల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ జ్యోతిరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులు 9న చలో ప్రజావాణికి తరలిరావాలి



నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి వ్యాప్తంగా దాదాపు 25 వేల మందికి పైగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 10 సంవత్సరాలకు పైగా కనీస వేతనాలు రావడం లేదని, ఎన్ని ప్రభుత్వాలు మారిన కాంట్రాక్టు కార్మికులను పట్టించుకొనే వారే కరువయ్యారని కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఏ ఓదెలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు అమలుచేయాలని ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలని సీఐటీయూ కాంట్రాక్టు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్ మైన్ వద్ద, మాదారం సివిల్ డిపార్టుమెంట్ వద్ద బ్లాస్టింగ్, సివిల్ కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఓదెలు మాట్లాడారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న సింగరేణి సీఎం అండ్ ఎండీ ఎన్ బలరామ్ నాయక్‌ను కూడా జనవరి నాల్గవ తేదీన కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశామని ఆయన తెలిపారు. ఎన్నికల సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లిస్తామని ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు కార్మికులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చారి, ఇస్తారి, పర్వతాలు, కొమురన్న, తిరుపతి, బుచ్చయ్య, రాజన్న, ప్రవీన్‌కుమార్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## ఫాతిమా షేక్ జయంతి వేడుకలు



**కాగజ్‌నగర్ :** రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతిని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. బాలికా విద్య కోసం ఫాతిమా షేక్ ఆ రోజులలో ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జయదేవ్ అబ్రహం, కార్యదర్శి ఎం శివప్రసాద్, సభ్యులు నర్సయ్య, పురుషోత్తం, సునీల్, అన్వరుద్దీన్, రాజేశ్వర్, శివలింగం పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించిన బీజేపీ నాయకులు



**బెజ్జూరు:** మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన జంగంపల్లి బానయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సూచన మేరకు మంగళవారం బీజేపీ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి భార్య రాజేశ్వరికి వితంతు పింఛన్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామల తిరుపతి, అన్నారం తిరుపతి, చటారి రాజు, మోర్లె వెంకటేష్, మోర్లే సాయిబాబా, నికాడి విజయ్, ఇస్తారి పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి

**నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్**

పిప్పల్‌ధరి, ఆడ, కంఠ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్, సీపీఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ డీఎం కల్పనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ మండలంలోని



పిప్పల్‌ధరి గ్రామానికి బస్సు ట్రిప్పులు పెంచాలన్నారు. అడ, కంఠ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి వయా లాండసాంగి, వయా అర్లి(బి) కంఠ, తదితర గ్రామాలకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. స్పందించిన ఆర్టీసీ డీఎం హామీ ఇవ్వడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## ఉపాధి హామీ నిధులు వినియోగించుకోవాలి

**నవతెలంగాణ-లక్ష్మణచాంద**

ఉపాధిహామీ నిధులు సక్రమంగా వినియోగించుకొని అభివృద్ధి పనులు కొనసాగించాలని పొట్టపల్లి సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు అన్నారు. మంగళవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా ముగింపు గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాది హామీ సిబ్బంది శ్రీనివాస్, నాయకులు రాజు, చిన్నారెడ్డి, రవీందర్, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కందులను మద్దతు ధరకే అమ్ముకోవాలి

- సీఈఓ కాంబ్లె ప్రజ్ఞశీల్



**నవతెలంగాణ-ఉట్నూర్**

రైతులు పండించిన కందులను తొందరపడి మధ్యవర్తులకు తక్కువ ధరలకు అమ్మి రైతులు నష్టపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే అమ్ముకోవాలని సీఈఓ కాంబ్లె ప్రజ్ఞశీల్ అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న గంగాపూర్, అలీపూర్, కామాయిపేట్ గ్రామాల్లో సీఈఓ, సీసీలు క్షేత్రస్థాయిలో పర్యటించి, అక్కడి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ప్రమాణాలను పాటించడం ద్వారా మంచి ధరలకే తమ పంటలను అమ్ముకోవచ్చని అన్నారు. నేరుగా రైతుల ఖాతాలలో నగదు జమ అవుతుందని అన్నారు. కందులను బాగా ఆరబెట్టడం ద్వారా తేమ 12శాతం ఉండాలని నాఫెడ్ నాణ్యతా ప్రమాణాలు పాటించి, అధిక ధరలకు పంటను అమ్ముకోవాలని సూచించారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండల సమాఖ్య కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ జాడి రాజేశ్వర్, వీఓఏ చంపత్‌రావు, లక్ష్మి, చరణ్, గ్రామ పటేల్, రైతులు పాల్గొన్నారు.

# రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పకోవద్దు

- సదర్‌మాట్ నీటి విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించను
- మండల సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్**

వ్యవసాయ అధికారులు రైతులను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకొని ఇబ్బంది పెట్టవద్దని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ అధికారులు రైతుల విషయంలో నిబద్ధతగా పనిచేయాలని సూచించారు. అయ్యే పని ఉంటే అవుతుందని, కానిది ఉంటే కాదని స్పష్టంగా చెప్పాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండా, ఉన్న చోటనే నివేదికలు తయారు చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. సదర్‌మాట్ ఆయకట్టుకు నీటి విడుదల చేసి వారం అవుతున్నా ఇంతవరకు పూర్తి స్తాయి గలుమలకు నీరు ఎందుకు అందడం లేదని నీటి పారుదల శాఖాధికారులను ఆయన ప్రశ్నించారు. సదర్‌మాట్, కడెం, సరస్వతి కెనాల్ సాగు నీటి వనరుల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఊరుకోనని హెచ్చరించారు. ఒక రైతు పంట పండిస్తే ఆ కుటుంబంతో పాటు ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందని గుర్తుచేశారు. రెండు రోజుల్లోగా సదర్‌మాట్ ఆయకట్టు కింది గలుమలకు పూర్తి సాయిలో నీరు అందేలా చర్యలు తీసుకోవాలని నొక్కి చెప్పారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించ కుండా కాగితాల్లో అన్నీ బాగున్నాయని చూపిస్తే ఉరుకునేది లేదని ఆయాశాఖల తీరుపై మండిపడ్డారు. ఈ ప్రాంతం నుంచి వందల సంఖ్యల వాహనాల్లో ఇసుక అక్రమంగా తరలిపోతుందని దీనిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అనుమతి లేకుండా రవాణ చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆ సమయంలో సోమార్‌పేట్ సర్పంచ్ మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణానికి సరాఫరా చేసే ఇసుక విషయంలో మినాహాయింపు ఇవ్వాలని కోరగా, ఎక్కడికైనా ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారుల అనుమతి తప్పని సరి అని ఎమ్మెల్యే వివరించారు. ఎంపీపీ మొయిద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వాల్ సింగ్, ఎంపీడీఓ మల్లేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎక్కడుంటే అక్కడే వైద్యం

- పొలంలోనే సికిల్‌సెల్ రక్త పరీక్షలు



**నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్**

గిరిజనులు ఎక్కడుంటే అక్కడే వైద్యం నిర్వహిస్తామని అంకోలి పీహెచ్‌సీ డాక్టర్ సర్వరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మామిడికోరి గ్రామంలో సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించారు. మామిడికోరి గ్రామంలో మొత్తం 34 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారికి పరీక్షలు నిర్వహించేందుకు వెళ్లారు. సాధారణ 41 మంది పేషంట్లకు వైద్యమందించారు. అదేవిధంగా 79 మందికి సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో అందుబాటులో లేని వారికి పొలంలో ఉన్న గిరిజన మహిళలకు అక్కడికే వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు, పవార్ ప్రేమ్‌సింగ్, ముయ్యాల మోతి, రోహిదాస్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## ఎలాంటి తప్పుల్లేకుండా నమోదు చేయాలి



**నవతెలంగాణ-తలమడుగు**

ప్రజాపాలన దరఖాస్తు ఫారాలను ఎలాంటి తప్పుల్లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ రమాకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాలకు గాను ప్రజాపాలనలో మండలంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఫారాలను తప్పు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. మండలంలో నిర్వహించిన ప్రజాపాలనలో 11,717 దరఖాస్తులు రాగా మంగళవారం నాటికి 5000 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందపరచినట్లు అధికారులు తెలిపారు. మిగతా దరఖాస్తులను కూడా సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు.

# మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే చెల్లించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ.స్వామి



ప్రతిజ్ఞ చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

**నవతెలంగాణ-తలమడుగు**

గత ఐదు మాసాల నుంచి పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ.స్వామి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ తలమడుగు మండల మహాసభ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన బిల్లులు సకాలంలో రాక మధ్యాహ్నం భోజన కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో మధ్యాహ్న భోజ కార్మికులు మెనూ ప్రకారం నిర్వహించలేక పోతున్నారన్నారు. పాఠశాలలలో పౌష్టిక ఆహారం అందించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. అందులో భాగంగా గత ఐదు మాసాల నుంచి బకాయి పడిన మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే మంజూరు చేయాలని అన్నారు. కార్మికుల వేతనాన్ని మూడు వేల చొప్పున నెలవారీగా చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు, కేజీబీవీ సిబ్బందికి గత రెండు నెలల నుంచి వేతనాలు రాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి వేతనాన్ని వెంటనే చెల్లించాలని కోరారు.

**తలమడుగు టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక**

ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ తలమడుగు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాళ్లె నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ విజయ్, ఉపాధ్యక్షులుగా ఎస్.చిన్నయ్య, కె.ప్రజ్ఞ జ్యోతి, కోశాధికారిగా రాథోడ్ రవీందర్, కార్యదర్శులుగా కే.లింగన్న, కే శంకర్ ఎ.సురేష్, కె.విజయ కుమారి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కాంతారావు, సభ్యులుగా విజయ్‌సింగ్, దివాకర్, పత్రికా కన్వీనర్‌గా శంకర్‌రావు, సాంస్కృతిక కన్వీనర్‌గా కె.ఆనందరావు, మహిళా కన్వీనర్ గా ఎస్.లక్ష్మి, సోషల్ మీడియా కన్వీనర్‌గా అనిల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అశోక్, ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, విజయ్, ఉపాధ్యక్షులు చిన్నయ్య, కోశాధికారి రవీందర్, కార్యదర్శి శంకర్, సురేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరువతో బాలింత సురక్షితం



**నవతెలంగాణ-భైంసా**

తానూర్ మండలంలోని జోల(కె) గ్రామానికి చెందిన యశోద అనే నిండు గర్భిని పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే బాలింతకు గుండెలో రంధ్రం ఏర్పడి, శ్వాస నాళాలలో నీళ్లు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. బాధితులు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు ఈ విషయం తెలియజేయడంతో మహారాష్ట్ర నుంచి కార్డియాలజిస్ట్ డాక్టర్ అరుణ్‌ను ఆస్పత్రికి రప్పించారు. భైంసా ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ అరుణ్ కలిసి బాలింతకు చికిత్సలు చేశారు. దీంతో మెరుగైన చికిత్స అందడంతో ప్రాణాపాయం నుంచి బాలింత బయటపడింది. ఇటువంటి కేసుల్లో వెయ్యి మందిలో ఒకరు మాత్రమే బతుకుతారని వైద్యులు వెల్లడించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలింత విషయాన్ని బాధితులు తెలియజేయగా ఎమ్మెల్యే వెంటనే స్పందించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సుందరీకరణ పనుల పరిశీలన

**నవతెలంగాణ-ఉట్నూర్**





మండలంలో కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో రాజమండ్రి నుంచి తీసుకొచ్చిన మొక్కలను సుందరీకరణ పనులను మంగళవారం ఐటీడీఏ పీఓ చాహత్‌బాజ్‌పాయ్, వికాస్ రాజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ కుమురంభీం కాంప్లెక్స్ నుంచి పీఎమ్మార్సీ వరకు మొక్కలు నాటి సుందరంగా తీర్చి దిద్దాలని అన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అనుకూలంగా ఉండాలన్నారు. క్రీడా పనులను వేగవంతం చేయాలనీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాథోడ్ భీంరావ్, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**నవతెలంగాణ-ఖానాపూర్**

ఇటీవల ఖానాపూర్ పట్టణానికి చెందిన విలేకరి కైసర్ తండ్రి గౌస్ ఉద్దీన్ మరణించగా మంగళవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ మండలాధ్యక్షులు దయానంద్ ప్రమాదవశాత్తు కాలు విరిగింది. కాగా ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఉండాలి

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఉండాలని, మానసికంగా ధృడంగా ఉండాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డిపో గ్యారేజ్‌లో టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉద్యోగులందరికీ వన భోజన మహోత్సవం ఏర్పాటు చేశారు. అంతకుముందు ఉద్యోగులు కోసం గేమ్స్ కండక్ట్ చేయగా వారందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటలతో సరదాగా గడిపి కొంత సేదతీరారు. అనంతరం వచ్చిన ఉద్యోగులందరినీ డిపో గ్యారేజీ ఆవరణలో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్, డిపో మేనేజర్ కల్పన, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తాం

- రైల్వే స్టేషన్‌ను సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

అమృత్ భారత్ పథకంలో భాగంగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలతో పాటు ఇతర పనులు కొనసాగుతున్నాయని, వచ్చే జూన్, అగస్టులోగా ఆ పనులు పూర్తి అవుతాయని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఆర్.ధనుంజయులు అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ను ఆయన సందర్శించి, ఇక్కడి వసతులు, పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ క్వార్టర్లు, ఆస్పత్రి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, పిట్ లైన్ పనులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు రైల్వే స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏజీఎం ధనుంజయులు మాట్లాడుతూ ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేలా పనులు జరుగుతున్నాయన్నారు. దాదాపు రూ.23కోట్లతో 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఫిట్ లైన్ ఇతర పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే ఏజీఎం ధనంజయులు

మరిన్నీ లైన్స్ వేసి జిల్లా నుంచి ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను నడిపేలా ప్రణాళికలు చేశామని పేరొన్నారు. ప్రయాణికులకు ఆహ్లాదం కల్పించేలా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదే విధంగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసేలా కృషి చేస్తామన్నారు.

## జీఓ నెం.60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

రిమ్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ గార్డులు, పేషంట్ కేర్ సిబ్బందికి జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. మంగళవారం రిమ్స్ ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ రిమ్స్‌లో పని చేస్తున్న కార్మికులకు కాంట్రాక్టర్ జీఓ 60 ప్రకారం రూ.15వేల 600 చెల్లించాలని, అందులో పీఎఫ్ రూ.3 వేల 23, ఈఎస్ఐ రూ.484 పోగా రూ.12 వేల 93 వేతనాలు ఇవ్వాలన్నారు. కానీ రూ.11వేల మాత్రమే చెల్లిస్తున్నారని, ఫీఎఫ్ కూడా వెయ్యి తక్కువ కడుతున్నారని ఆరోపించారు. కార్మికులకు జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని అన్నారు. సీనియార్టీ ప్రకారం పేషెంట్ కేర్‌లుగా నియామించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రాజేందర్ సింగ్, పులసాని వెంకటేష్, డి.ప్రశాంత్, వామన్, ఇమ్రాన్ ఖాన్, నర్సింగ్, శ్రీను, కవిత, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

## మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేయాలి



**నవతెలంగాణ-బేల**

గతంలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించిన పనులకు మళ్లి భూమి పూజ చేయడం సమంజసం కాదని, మీరు కొత్తగా నిధులు తెచ్చి గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని బీఆర్ఎస్ నాయకుడు మంగేష్ ఠాక్రే అన్నారు. రెండు రోజుల కింద ఎమ్మెల్యే పాయల శంకర్ మండలంలోని ఉపాసనాల గ్రామంలో ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేయడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మంగేష్ ఠాక్రే మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని అన్నారు. కానీ మళ్లీ అవే పనులకు ఎమ్మెల్యే పాయల శంకర్ భూమి పూజ చేసి ప్రారంభించడం సమంజసం కాదని అన్నారు. మళ్లీ కొత్తగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తే స్వాగతిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, దేవన్న ప్రమోద్ రెడ్డి, సతీష్ పవార్, విపిన్, సునీల్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**నవతెలంగాణ-తలమడుగు**

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తలమడుగు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జగన్ సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో రోజుకు రోజుకు అనేక రకాల నేరాలు జరుగుతున్నాయని అన్నారు. వీటి పట్ల మనం జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఆధార్ నెంబర్‌గాని బ్యాంకు అకౌంట్స్ ఓటీపీ నెంబర్‌లకు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించి ఉండాలని అన్నారు. ఆటో డ్రైవర్స్ అధిక ప్రయాణికులను ఎక్కించుకోకుండా పరిమితంగా ప్రయాణం చేసినట్లయితే అందరూ సురక్షితంగా తమ గమ్యాలకు చేరుకుంటారన్నారు. అతివేగంతో ప్రయాణించినట్లయితే ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉందన్నారు. మైనర్ పిల్లలకు ఎలాంటి వాహనాలను నడిపేందుకు కుటుంబ సభ్యులు అనుమతించవద్దన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడకంటే ముందే అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ఆపద వచ్చినప్పుడు 100 నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. లేదా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ రామ్‌రెడ్డి, హోంగార్డు గంగన్న, ఆటో డ్రైవర్లు, గ్రామస్తులు, యువకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు బంద్

**నవతెలంగాణ-బోథ్**

మండల పరిధిలోని మార్కెట్ యార్డ్‌కు సంబందించిన బోథ్, పొచ్చెర, నేరడిగొండ, సొనాల, జిన్నింగ్‌లలో ఈ నెల 10 నుంచి 17 వరకు పత్తి కొనుగోలు కేంద్రాలు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ సెక్రటరీ దేవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆయా జిన్నింగ్‌లలో పత్తి నిల్వలు ఎక్కువ అవడంతో తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

## నేడు వ్యాకరణ ప్రజ్ఞా పరీక్ష

**నవతెలంగాణ-ముధోల్**

మండలంలోని రవీంద్ర హైస్కూల్లో బుధవారం వ్యాకరణ ప్రజ్ఞా పరీక్ష నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ చిమ్మపూడి ఫౌండేషన్ భైంసా డివిజన్ కన్వీనర్ జాధవ్ పుండలిక్ రావు పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగే ఈ పరీక్షకు పదోతరగతి చదువుచున్న విద్యార్థులు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్ నెం. 9441333315 సంప్రదించాలని కోరారు.

## ఎంపీని కలిసిన పాఠశాల సమితి సభ్యులు

**నవతెలంగాణ-ముధోల్**

మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల సమితి ప్రబంధకారిని సభ్యులు మంగళవారం ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావును ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా నిర్మితమవుతున్న పాఠశాల భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు రవి పాండే, సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, ప్రబంధకారిని సభ్యులు దర్బార్ నవీన్, ప్రధానాచార్యులు సారథి రాజు, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## భార్యపై భర్త హత్యాయత్నం

**నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్**

భార్యపై భర్త హత్యాయత్నం జరిగిన సంఘటన మండలంలోని భీంసరి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీంసరి గ్రామానికి చెందిన జక్కుల కమలను జక్కుల చంద్రకుమార్ గత కొంత కాలం నుంచి అనుమానంగా వ్యవహరిస్తున్నాడు. సోమవారం రాత్రి కమలపై బ్లేడ్ తోటి హత్యాయత్నం చేశాడు. బావ ఇద్దరు పిల్లలు కాపాడారు. వెంటనే జిల్లా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కమల ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | జనవరి 10, 2024 | www.navatelangana.com

## గురుకులాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గిరిజన విద్యార్థులు గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల్లో 5వ తరగతి ప్రవేశ బ్యానర్ ను సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో అన్ని వసతులు ఉండేలా చూడాలని సూచించారు. గిరిజన విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నూతనంగా బాలుర పాఠశాల, కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని ప్రధాన ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్ళు అనిత, సురేష్, వైస్ ప్రిన్సిపాల్ కవిత, సిబ్బంది కృష్ణమాచారి, సత్యనారాయణ, ప్రేమల, వెంకటేష్, ఆనందరావు పాల్గొన్నారు.

## నజ్రూల్‌నగర్‌లో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్




మండలంలోని నజ్రూల్ నగర్ మార్కెట్‌లో మంగళవారం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం, దుర్గా మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నజ్రూల్ నగర్ సర్పంచ్ అనుపగరామి, మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు రేఖా మండల్, మమతా రానా, గౌరవ అధ్యక్షులు ప్రీతి మండల్, సుచితార్, ఆశా బిశ్వాస్, భబిత, సీపీఎం పార్టీ నాయకులు ముంజం ఆనంద్ విజేతలకు బహుమతులు అందజేశారు.

## ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులలో పొందుపరిచిన వివరాలను ఈనెల 17వ తేదీలోగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఆసిఫాబాద్ మండలంలో మొత్తం 9403 దరఖాస్తులు వచ్చాయని, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ ఈఓ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం తదితర కార్యాలయాలలో ఈ నెల 5వ తేదీ నుంచి ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులను ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ సైట్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## విశ్రాంతి ఉద్యోగికి లమ్‌సం చెక్కు అందజేత

నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ అన్‌వ్యాలిడేట్ అయిన ఉద్యోగికి పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం లమ్‌సం(ఏకమొత్తం చెల్లింపు) చెక్కును అందజేశారు. అచ్చె సత్యనారాయణ ఖైరిగూడ ఉపరితల గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తూ మెడికల్ ఇన్వాలిడేట్ అయ్యారు. వారసులకు ఉద్యోగం కానీ, ఎంఎంసీ(నెల వారి జీవన భృతి)కి కాకుండా లమ్‌సం(ఏకమొత్తం చెల్లింపు) కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆదాయ పన్ను మినహాయింపు కాగా మంజూరైన రూ.19.15 లక్షలు చెక్కును విశ్రాంతి ఉద్యోగికి అందజేశారు. ఈ డబ్బులను పొదుపు చేసుకొని సంతోకరమైన జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

## టాస్క్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగ యువతీ యువకులు టాస్క్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో జిల్లా ఎగ్జామినేషన్ అధికారి ఉదయబాబుతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టాస్క్ వారి బేసిక్ ఐటీ స్కిల్, సాఫ్ట్ స్కిల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాస్క్ ద్వారా ప్రతి ఒక్కరూ టెక్నికల్ జ్ఞానాన్ని పొందవచ్చని అన్నారు. ఈ శిక్షణలో కాకుండా అనేక రకమైన కంప్యూటర్ సంబంధిత శిక్షణలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ టాస్క్ సేవలు సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ రంగంలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోల్కర్ సుధాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐదు నెలల క్రితం హత్యకు గురైన మండలంలోని అంకుశపూర్ గ్రామానికి చెందిన పోల్కర్ సుధాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు డిమాండ్ చేశారు. కమిటి సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కుటుంబ సభ్యులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్‌ను తన సహచర ఆటో డ్రైవర్లు హతమార్చారని, దీనికి సంబంధించి గతంలో ధర్నా చేసినప్పుడు హామీ ఇచ్చారన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహల్కార్ అశోక్, సిడాం అర్జు మాస్టర్, భానోత్ గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

## మాల మహానాడు క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ మాల మహానాడు కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు తమకు సంఘం భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

**జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో..**

జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సరం క్యాలెండర్‌లను స్థానిక వెంకటరమణ థియేటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు జూనియర్ ఎన్టీఆర్ పేరుతో తాము పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కుంటాల నారాయణ, అభిమానులు మల్లిఖార్జునగౌడ్, రాజయ్య, రవి, దామోదర్, జోగు శ్రీను, మోతీరాం, ప్రనీల్‌కుమార్ పాల్గొన్నారు.



## సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

● డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్




జిల్లాలో సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిర్యాని మండలంలో పనిచేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కొంతమంది సమయపాలన పాటించకుండా గైర్హాజరు అవుతున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలకు హాజరు కాకుండా ఉపాధ్యాయులు సొంత అవసరాల నిమిత్తం పనిచేస్తూ పాఠశాలకు సరిగ్గా రావటం లేదన్నారు. అంతేకాకుండా సమయపాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇతర జిల్లాల నుండి రాకపోకలు చేస్తూ తమ విధులకు గైర్హాజరు అవుతున్నారని, కొంతమంది ఉపాధ్యాయులు తమ స్థానంలో ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత పనులకు వెళ తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఫేక్ నెట్వర్క్ తోటి బయోమెట్రిక్ వేసుకొని తమ రిజిస్టర్‌లో హాజరు వేసుకుంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో విద్యార్థులకు నష్టం జరుగుతోందన్నారు. ఎంఈఓ, డిఈఓ స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. పాఠశాలకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిర్యాని మండల ఉపాధ్యక్షులు బోర్కుంట పార్థు, మండల సహాయ కార్యదర్శి రేకల గణేష్, నాయకులు చిందం రంజిత్, వేముల గురు, భారత్ పాల్గొన్నారు.

## భేటీ బచావో-భేటీ పడావోపై దృష్టి పెట్టాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా సంక్షేమ శాఖ, విద్య, వైద్య, గిరిజనాభివృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన, పోలీసు శాఖల అధికారులు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం ద్వారా భ్రూణహత్యలు నివారించి ఆడపిల్లలను రక్షించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గర్భిణులు ఆసుపత్రులలో ప్రసవాలు చేసుకునేలా వివరించాలని, తద్వారా జనభా లింగ నిష్పత్తిలో ఆడపిల్లల శాతం పెరిగేలా కృషి చేయాలని, ఆ దిశగా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బాలికలకు విద్య, వైద్యం అందించే అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక కృషి సారించాలని, ఆడపిల్లలను కాపాడుకోవాలని అన్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకంపైన అందరూ ద్రుష్టి సారించాలని, 10 ఏళ్ళ వయసులోపు ఆడపిల్లలందరికి సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచేలా ఆడపిల్లల తల్లి దండ్రులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థినులు, బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామపంచాయతీలలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంపై విస్తత ప్రచారం నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో షీ టీం ల ద్వారా గ్రామాలలో బాలికలు, ఆడపిల్లల చదువుపై భరోసా కల్పించాలని, బాలికలు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించే విధంగా ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీల వారిగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలలో సెమినార్లు, పోటీ పరీక్షలు నిర్వహించడం, గోడరాతలు రాయడం, ప్రతిజ్ఞ చేయించడం, న్యూట్రిషన్ కిట్లు అందించడం, బాల్య వివాహాలు లేని గ్రామాలకు ప్రోత్సాహకాలు అందించడం, బ్యానర్లు, ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని, జాతీయ బాలికల శిశు సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కళాజాత బృందాల ద్వారా భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం బేటి బచావో-భేటీ పడావో కార్యక్రమ సంబంధిత 2024 సంవత్సరపు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి




నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు ఇదే డిమాండ్‌తో సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికులు అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ సంస్థకు సేవ చేస్తున్నారని తెలిపారు. సంస్థకు లాభాలు రావడంలో, సింగరేణి సంస్థ అభివృద్ధి చెందడంలో కార్మికులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. చట్టాలు అమలు చేయకపోవడంతో వీరు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. దీనివల్ల వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలున్నాయన్నారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.32 వేలు, క్లీనర్లకు రూ.18 వేలు ఇవ్వాలన్నారు. బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యానికి సెప్టెంబర్‌లో సమ్మె నోటీసు ఇచ్చామని, చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతినెల 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, ప్రమాద బీమా ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇవ్వాలని, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు లచ్చన్న, రవిప్రసాద్, కార్యదర్శులు బుచ్చన్న, కృష్ణ, జాయింట్ సెక్రటరీ సాగర్, కోశాధికారి ఎం సత్యనారాయణ, సభ్యులు రాజ్‌కుమార్, కొండగొర్ల చందు, జ్యోతిరావు పాల్గొన్నారు.



## ఎంపీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

● ఆసిపాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాబోవు పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు లతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చుల పరిమితికి లోబడి అభ్యర్థులు ప్రచార ఖర్చులు చేయవలసి ఉంటుందని, చేసిన ప్రతి ఖర్చును నమోదు చేసి పూర్తి వివరాలను సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. సభలు, సమావేశాలు, ప్రకటనలు ఇతరత్రా ప్రచార కార్యక్రమంలో వినియోగించే ప్రతి అంశాన్ని ఎన్నికల నియమావళికి లోబడి నిర్వహించవలసి ఉంటుందని, దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటర్ల జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ఏజెంట్లు అధికారులకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారత న్యాయ సంహిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ డీఎం శ్రీధర్ తోపాటు, కలెక్టర్ బొర్కాడే హేమంత్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత చట్టాన్ని నిరసిస్తూ నేటి నుంచి ఆర్టీసీ బస్సులు డ్రైవర్లు సమ్మెలోకి వెళ్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాక్సిడెంట్ కేసులు డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.ఏడు లక్షల జరిమానా విధించడం అత్యంత దారుణమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మధుసూదన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలేష్ కుమార్, కార్యదర్శి షఫీ పాల్గొన్నారు.

## పోలీసుల సంక్షేమం కోసమే వైద్య శిబిరాలు

● ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం పలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోందని జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ టౌన్ పోలీసు స్టేషన్‌లో శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి, హన్మకొండ మరియు టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసులకు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, వారి కుటుంబసభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టే పోలీసులు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో టీవీ, మొబైల్ అధికంగా వాడడం వల్ల కంటి సమస్యలు వస్తున్నాయని, వీటిని ఎప్పటికపుడు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టౌన్ సీఐ బుద్దే స్వామి, రూరల్ సీఐ నాగరాజు, సీనియర్ అప్తమాలజిస్టు అశోక్, కో ఆర్డినేటర్ మహేందర్, కౌన్సిలర్ అజయ్, ఎస్ఐలు అంజన్న, శ్రీకాంత్, కళ్యాణ్, రామన్‌కుమార్, సోనియా, సిబ్బంది పాల్గొన్నారు.

## వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఇచ్చే ట్రైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల కోసం ఉచిత శిక్షణకు మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోలేటిలో ట్రైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్, మాదారంలో మగ్గం, బ్యూటీషియన్ కోర్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 15వ తేదీ సోమవారం సాయంత్రం ఐదు గంటలలోపు పర్సనల్ డిపార్టుమెంట్‌లోని సేవా సమితి కోఆర్డినేటర్‌కు దరఖాస్తు అందజేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 9951214116ను సంప్రదించాలని తెలిపారు.

## 60 మందికి ఉద్యోగోన్నతి

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో ఒకే కేటగిరిలో ఎనిమిది సంవత్సరాలు పని చేసిన 60 మంది ఉద్యోగులు పదోన్నతి పొందారని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదోన్నతి పత్రాలను ఉద్యోగులు పనిచేసే ఆయా గనులు, డిపార్టుమెంట్లకు పంపించామని తెలిపారు.

## శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు మంగళవారం కేరళ రాష్ట్రంలోని శబరిమలకు బయలుదేరారు. 41 రోజుల మండల దీక్ష అనంతరం మంగళవారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో రెబ్బెన మండలానికి చెందిన గురుస్వామి మునునూరి సూర్య భాస్కర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు బయలుదేరారు. బయలుదేరిన వారిలో గురు స్వాములు దూడల అశోక్, చిట్టిమల్ల సంతోష్, వేణుగోపాల్, బట్టుపల్లి సంతోష్, షెండే గణేష్ స్వాములు పాల్గొన్నారు.



## మాజీ ఎంపీపీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లక్సెట్టిపేట



మాజీ ఎంపీపీ కట్ల చంద్రయ్య ఇటీవలే అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం రోజున చంద్రయ్య అనారోగ్యంగా ఉన్నరానే విషయం తెలిసిన వెంటనే వారి ఇంటికి మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## 15న ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని శ్రీరాంనగర్‌లో జనవరి 15న తేదీన ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించనున్నామని ఐద్వా మహిళా సంఘం జిల్లా ధ్యక్షురాలు పాటు విజయ తెలిపారు. మంగళవారం ఐద్వా మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీ నిర్వహిస్తామని, అందులో భాగంగానే 15వ తేదీన ముగ్గుల పోటీ జరుగుతుందన్నారు. మహిళలంతా హాజరై ముగ్గుల పోటీలలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కార్మికులకు లాకర్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల వస్తువులు భద్రపరచుకునేందుకు లాఖర్లు ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులలో పనిచేసే కార్మికులు విధులకు హాజరయ్యేందుకు వచ్చేటప్పుడు వారి హెల్మెట్‌తో పాటు మొబైల్స్ పర్సు వెంటపెట్టుకొని రావడం జరుగుతుందని, సమాచారం కొరకు మొబైల్స్ వాడడం, అత్యవసర ఖర్చుల నిమిత్తం పర్సులో డబ్బులను పెట్టుకొని రావడం జరుగుతుందన్నారు. డ్యూటీ కి వచ్చిన తర్వాత ఇంటి వద్ద నుండి వేసుకొని వచ్చిన దుస్తులను విప్పి మొబైల్స్, పర్సు, వెంబడి తెచ్చుకున్న హెల్మెట్‌ను భద్రపరచుకునేందుకు భద్రతతో కూడిన పెట్టెలు లేవన్నారు. ఇటీవల, గతంలోనూ గనుల పైన కార్మికుల పాత పెట్టెలను చెక్క పెట్టెలను పగలగొట్టి అందులోనే విలువైన మొబైల్స్, డబ్బులను కూడా ఎత్తుకెళ్లటం జరిగిందన్నారు. ఇటీవల ఆర్కే-5 గనిలోను పెద్ద ఎత్తున దొంగతనం జరగడంతో కార్మికులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ విషయాలను సానుకూలంగా అర్థం చేసుకొని కార్మికులందరికీ మొబైల్, పర్స్‌తో పాటు కార్మికుల దుస్తులు, హెల్మెట్, బూట్లు వంటివి భద్రపరచుకునేందుకు సేఫ్టీ లాకర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

## బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-10, బేటి బచావో-బేటి పడావో కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య, బాలల పరిరక్షణ సమితి చైర్మన్ వాహిద్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంక్షేమం, రక్షణ, పునరావాసంపై అధికారులు సమన్వయంతో పని చేయాలని, బాలకార్మిక వ్యవస్థ సంపూర్ణంగా నిర్మూలించే దిశగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆపరేషన్ స్మైల్-10లో భాగంగా ఈ నెల 1 నుండి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా రైస్ మిల్లులు, భవన నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, గ్లాస్ కటింగ్ ప్రదేశాలు, వ్యాపార సంస్థలు, సముదాయాలను తరుచూ పర్యవేక్షిస్తూ బాల కార్మికులను, భిక్షాటనలో ఉండే పిల్లలను క్యాటగిరీల వారిగా గుర్తించాలని, వారి రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ వారి వయస్సుల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశాల్లో చేర్పించాలని, బాలల పరిరక్షణ కేంద్రాలలో అప్పగించాలని తెలిపారు. బాల కార్మికులచే పని చేయిస్తున్న సంస్థలు, యజమానులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఆపరేషన్ స్మైల్ ద్వారా బాలల సుస్థిర అభివృద్ధికి, శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, బాలల సంరక్షణ అధికారి ఆనంద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ పాల్గొన్నారు.



## సైబర్ సెక్యూరిటీపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సైబర్ సెక్యూరిటీకి సంబంధించి అవగాహన సదస్సును కార్పొరేట్(ఐటి), హెచ్‌ఆర్డీ డిపార్ట్మెంట్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, డీజీఎం(ఐటి) కార్పోరేట్ ఎం.శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తముగా ప్రస్తుతం అందరూ తమ వృత్తులలో, ఆర్థిక లావాదేవీల కోసం మొబైల్, కంప్యూటర్ల ద్వారా ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్నారని, ఈ క్రమంలో కొంత మంది సైబర్ మోసం ద్వారా గోప్యమైన వివరాలను సంపాదించి చాలా మందిని మోసం చేస్తున్నారని అన్నారు. మన కోల్ ఇండస్ట్రీలో ఇలాంటి సైబర్ మోసాలను అరికట్టడం కోసం మినిస్ట్రీ ఆఫ్ కోల్, హోంఎఫైర్స్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జాతీయ సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వార సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకొని మన సంస్థ, ఉద్యోగుల వివరాలను, రోజువారీగా చేసే ఆర్థిక లావాదేవీలు, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని కాపాడుకోవాలని తద్వారా సింగరేణి సంస్థకు, వ్యక్తిగతంగా ఎలాంటి నష్టం జరుగకుండా జాగ్రత్త పడొచ్చు అని తెలిపారు. అనంతరం డీజీఎం(ఐటి) ఎం.శ్రీనివాస రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు సైబర్ సెక్యూరిటీ నందు గల వివిధ విషయాల గురించి అధికారులకు ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం కె.రఘు కుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఎస్ఆర్పీ 1 అండ్ ఎస్ఆర్పీ 3 3ఏ గ్రూప్ గనుల ఏజెంట్ గోపాల్ సింగ్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, శ్రీరాంపూర్ ఏరియా ఐటీ హెచ్ఓడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ విడుదల

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను మంగళవారం ఆవిష్కరించారు. దేవాపూర్, ధర్మారావుపేట కాంప్లెక్స్ హెచ్ఎంలు రాథోడ్ రమేశ్, సుధాకర్ నాయక్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వేల్పుల కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు మంతెన రమేశ్, మడావి తిరుపతి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

● అదనపు కలెక్టర్ బి.రాహుల్




నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థి దశ నుంచే సుస్థిర జీవన విధానంతో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక విద్యార్థి కృషి చేయాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో భారత పర్యావరణ అటవీ వాతావరణ మార్పుల శాఖ-తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిర జీవన విధానం-పర్యావరణంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పర్యావరణ పరిరక్షణ అలవర్చుకోవాలని అన్నారు. బాల్యం నుండే పాఠశాలలు, వీధులు, నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం అలవడితే భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు ఉంటాయని అన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో గ్రీన్ కోర్ పర్యావరణ క్లబ్బుల ద్వారా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యర్థాల నిర్వహణ, కంపోస్టింగ్, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నివారణ, జీవవైవిధ్య రక్షణ అంశాలపై రాష్ట్ర ప్రాజెక్టు అధికారులు బి.విద్యాసాగర్, మేజర్ శివకిరణ్, వెంకటేశ్వర్లు ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ప్రదర్శించిన "ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం" కార్యక్రమం, ఎన్‌జీసీ డైరెక్టర్ సంతోష్ ప్రదర్శించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. అనంతరం బట్ట సంచులను, పర్యావరణ పరిరక్షణ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ కోర్ సమన్వయకర్త గుండేటి యోగేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-తాండూర్



జులై 2023 నుంచి రెండవ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగ్గని రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జడ్పీఎస్‌హెచ్ తంగలపల్లి పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎంఈఓ ప్రభాకర్, తంగలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం, కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమక్షంలో నిర్వహించిన. ఈ కార్యక్రమంలో బగ్గని రవి కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగుల అన్నిరకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జులై 2023 నుండి 2వ పీఆర్సీ అమలు చేయవలసి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కమిటిని నియమించలేదని తెలిపారు. ముఖ్యమంత్రి వెంటనే పీఆర్సీ కమిటిని నియమించి త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తపస్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు విద్యా సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు రమణయ్య, తాండూరు మండల అధ్యక్షుడు వేణుగోపాల్ రావు, మండల బాధ్యులు విశ్వేశ్వర రావు, రజిత పాల్గొన్నారు.

## ప్రయివేట్ ట్రావెల్స్ వాహనదారుల నిలువు దోపిడీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రయివేట్ ట్రావెల్స్ వాహనదారులు నిలువు దోపిడి చేస్తున్నారని, రవాణాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని షెడ్యూల్డ్ క్యాస్ట్ మాదిగ ఫెడరేషన్,( ఎస్సీ-ఎంఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు న్యాయవాదులు రాజలింగు మోతె, ముల్కల కనకయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండగ రద్దీని ప్రయివేట్ ట్రావెల్స్ క్యాష్ చేసుకుంటున్నాయని, ప్రయాణికులను నిలువుగా దోచేస్తు అదనపు చార్జీలను వసూలు చేస్తున్నారని, దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ, రైళ్లలో టికెట్స్ దొరకకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో ప్రయాణికులు ప్రయివేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారని, ఆసరాగా చేసుకొని ప్రయివేట్ బస్సుల నిర్వాహకులు టికెట్ ధరలను అమాంతంగా పెంచేస్తున్నారని, అడిగే వారు లేకపోవడంతో అడ్డగోలుగా వసూలు చేస్తున్నారని తెలిపారు. వీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు.

## బెల్లంపల్లిలో పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ బన్సీలాల్ నేతృత్వంలో ఎస్సై ప్రవీణ్ సిబ్బందితో కలసి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లతోపాటు, శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాల, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై , ఇన్సూరెన్స్ లేని వారిపై, నెంబర్ ప్లేట్ నిబంధనల ప్రకారం లేని, వాహనాలపై కేసులు నమోదు చేశారు. రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధించినారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలు , లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి బండి ఇవ్వడం, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చేసే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని సీఐ బన్సీలాల్ తెలిపారు.

## టోర్నమెంట్లకు రెండు జట్ల నిషేధం

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని ముత్యంపల్లి గ్రౌండ్‌లో దేవాపూర్, కాసిపేట స్ట్రైకర్స్ క్రికెట్ జట్లను నిషేదించడం జరిగిందని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ముత్యంపల్లి క్రీడా మైదానంలో కాకా వేంకటస్వామి స్మారక క్రికెట్ టోర్నమెంట్ గత 12 రోజుల నుంచి నిర్వహిస్తున్నామని, ఈ టోర్నమెంట్ ఫైనల్ ఆదివారం నిర్వహించడం జరిగిందని, ఆ ఫైనల్‌లో దేవాపూర్, కాసిపేట స్ట్రైకర్స్ జట్లు తలపడగా అందులో భాగంగా మొదట కాసిపేట జట్టు బ్యాటింగ్ చేసి 106 పరుగులు చేసిందన్నారు. ఆ తరువత దేవాపూర్ జట్టు బ్యాటింగ్‌కు వచ్చిందని, ఒక బౌలర్ చెక్ బౌలింగ్ వేస్తున్నాడని, గొడవ మొదలు అయ్యిందని, ఎంపర్లు ఒక నిర్ణయం తీసుకొని ఎంత సర్ది చెప్పినా కూడా రెండు జట్లు టోర్నీ నిబంధనలు ఉల్లంఘించడం జరిగిందన్నారు. దింతో ప్రైజ్ మనీ ఇరు జట్లుకు ఇస్తామని చెప్పి సూపర్ ఓవర్ ఆడలని మేనేజ్మెంట్, ఎంపర్లు నిర్ణయించడం జరిగిందని, ఆ ప్రతి పాదన కూడా అంగీకరించక ఇరు జట్లు వెళ్లి పోవడం జరిగిందన్నారు. దింతో వారికి ఇచ్చే మనీ ప్రైజ్ ప్రజా ఊయోగార్థం వాకర్లకు, క్రీడాకారులకు, పార్కుకి వచ్చే ప్రజలకోసం ఉపయోగపడే విదంగా కాకా గడ్డం వేంకటస్వామి పేరు మీద బెంచీలు వేయడం జరిగిందన్నారు. ఇక ముందు జరిగే టోర్నమెంట్ కి ఈ రెండు జట్లను నిషేధించడం జరిగిందన్నారు.

## సత్యదేవుని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-దండేపల్లి

మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు మంగళవారం గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన హయాంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు గూడెం సత్యనారాయణ లిఫ్ట్ నిర్మాణం జరిగిందని ఎల్లంపల్లి ప్రాజెక్టు గూడెం లిఫ్ట్ ద్వారా వచ్చే నీరుతో రైతులందరికీ మేలు జరగాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు నిరంధాలని రైతులంతా సుఖ సంతోషాలతో ఉండాలని దేవున్ని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. అధికారంలో లేకున్నా ప్రజలకు అండగా ఉంటూ అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంతలో పశువులతో ప్రజలకు ఇక్కట్లు

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న సంతలో పశువులు చిరు వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కూరగాయలు పండ్లు, రోడ్డుపై పెట్టుకొని అమ్ముకునే వారి దుకాణాలను ఆగమాగం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పంచాయతీ అధికారుల స్పందించి సంతలో ఆవులు పశువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

## ఆన్‌లైన్ నమోదును పరిశీలించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కాసిపేట

స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన ఆన్లైన్ వివరాల నమోదు కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. కాసిపేట మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ నమోదు చేస్తుండగా ప్రక్రియను ఆడిషనల్ కలెక్టర్ రాహుల్ పర్యవేక్షించి, డాటా ఎంట్రీ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఏ అలీం, తహసీల్దార్ భోజన్న, ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కలిసి పోలీసు, రెవెన్యూ, గనుల శాఖల అధికారులతో జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమంగా తరలించడాన్ని నియంత్రించేందుకు పోలీసు, రెవెన్యూ, గనుల శాఖల అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలించే ప్రాంతాలను 24 గంటలు పర్యవేక్షించాలని, వాహనాలను తనిఖీ చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల యజమానులకు 2 సార్లు జరిమానా విధించాలని, అయినప్పటికీ అక్రమ రవాణాను కొనసాగిస్తే కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక అవసరాల నిమిత్తం ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు జిల్లాలోని అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న ప్రాంతాలైన కాలేజ్‌రోడ్, పాత మంచిర్యాల, ముల్కల్ల ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గనుల శాఖ అధికారి బాలు, గ్రామీణ నీటి పారుదల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, మోహన్, మంచిర్యాల, హాజీపూర్ తహశిల్దార్లు కేవై.ప్రతాప్, శశికుమార్, భూగర్భ జల శాఖ అధికారి గణేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జన్నారం

మండలం కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తోకల సురేష్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకుడు శ్యామ్ నాయక్ మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, డైరెక్టర్ రజాక్, సురేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని వెంకటరమణ ఫర్టిలైజర్ షాపును ఏఓ సంగీత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ షాపులలో, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, పెండింగ్ డీడీలు ఏమన్నా ఉన్న పూర్తి చేసుకోవాలన్నారు. ఈపాస్ మిషన్ల ద్వారా ఎరువుల విక్రయాలను జరపాలని ఆమె సూచించారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఏఈఓలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని రెబ్బనపల్లి గ్రామానికి చెందిన గొల్ల వెంకయ్య ఇల్లు ఇటు వల ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయి. గ్రామ సర్పంచ్ కందుల కళ్యాణి అశోక్ పేటకు చెందిన సాయి గణేష్ సేవా సమితి వారు ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయంతోపాటు నిత్యవసర సరుకులు అందజేశారు. అమెరికాలో ఉంటున్న పాటిబండ్ల శశిధర్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా పేదలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని సర్పంచ్ కందుల కళ్యాణి అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి గణేష్ సేవ సమితి సభ్యులు పాటిబండ్ల ప్రసన్న శ్రీరామమూర్తి, నరేంద్ర ప్రభాకర్, జైన శ్రీనివాస్, సుమతమ్మ, వినోద్ శర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జనవరి 10, 2024 | www.navatelangana.com



## పర్యావరణంతో ముడిపడిన పండుగలు

**జైపూర్ :** ఏడాది పొడవు వివిధ మాసాల్లో వచ్చే పండుగలు పర్యావరణంతో ముడిపడి ఉంటాయని తెలంగాణ స్టేట్ అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి పేర్కొన్నారు. మండలంలోని ముదిగుంట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పర్యావణం-సంక్రాంతి సాంప్రదాయం అనే అంశంతో నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు వివిధ రకాల ముగ్గులు వేశారు. విజేతలుగా నిల్చిన విద్యార్థులకు బహుమతులు ప్రకటించారు. సర్పంచ్ దుగుట జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు విజయదుర్గ, శ్రీలత, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ జి.సురేష్ కుమార్, లక్ష్మణ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పవన్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, రాజేశ్, సాయికిరణ్, మొండి, షాహీద్, సాయి పాల్గొన్నారు.



## రెంకోని వాగు బ్రిడ్జికి రూ.5.20కోట్లు

### పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ నుంచి బెల్లాల్ వెళ్లే రహదారికి ఇబ్బందిగా ఉన్న రెంకోని వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5.20 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే చెప్పారు. దిలావర్‌పూర్ ప్రాంతంలో రెంకోని వాగుపై లోతట్టుగా ఉన్న రోడ్ డ్యాం వర్షాకాలంలో వరదకు మునిగి అటువైపు రాకపోకలకు అంతరాయం కలిగేదన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ప్రధానమైన ఈ బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనుల విషయంలో ముందుంటుదని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారి మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్, తోట సత్యం, హమానుల్లాఖాన్, చిన్నం సత్యం, షబ్బీర్ పాషా, మీర్జా భేగ్, కరిపే రాజ్‌కుమార్, లక్ష్మీపతిగౌడ్, అమంద స్వామి, నబీఖాన్, మడిగెల గంగాధర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన మొదటిసారి ఖానాపూర్‌లో బ్రిడ్జి పనులను ప్రారంభించిన బొజ్జును పార్టీ కార్యకర్తలు, అధికారులు సన్మానించారు.

## ఆన్‌లైన్‌లో సమాచారం నమోదులో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రజాపాలన కార్యక్రమంలో 5 గ్యారంటీల పథకాల కొరకు ప్రజలు అందించిన దరఖాస్తు ఫారాల్లో పొందుపరిచిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల వివరాలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. నమోదు విధానంపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ వార్డు అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. నమోదు చేసే సమయంలో వార్డుల వారీగా దరఖాస్తు సంఖ్య నమోదు చేసిన అనంతరం కులం, పుట్టిన తేదీ ఆధార్, రేషన్‌కార్డు, మొబైల్ నెంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు.

## ఉన్నతాధికారులు వైద్య సౌకర్యాలు సమీక్షించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికులకు అందించే వైద్య సౌకర్యాలను ఉన్నతాధికారులు సమీక్షించాలని గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా అన్నారు. మంగళవారం ఏరియా ఆసుపత్రిని సందర్శించి మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రులలో కార్మికులకు అందించే వైద్య సౌకర్యాలకు కార్మికులు చాలా అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రమాదవశాత్తు కార్మికునికి గనిలో ప్రమాదం జరిగి ఆసుపత్రిలో చికిత్స కోసం వస్తే వైద్యులు కేవలం గాయం జరిగిన చోట మాత్రమే వైద్యం అందిస్తున్నారని, అలాకాకుండా వచ్చిన కార్మికునికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి కార్మికుని ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్స అందించాలన్నారు. మైన్‌లో ఆక్సిడెంట్ జరిగి ఆసుపత్రికొస్తే కార్మికుడికి బెడ్ కేటాయించి ఎటువంటి వైద్యం చేయకుండా ఆసుపత్రిలో ఉంచడం వల్ల కార్మికులు మానసికంగా ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కార్మికులకు అందించే వైద్య సౌకర్యాలను వెంటనే సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే-5 ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగారావు, బెల్లంపల్లి రీజియన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు రమణ, దేవేందర్ పాల్గొన్నారు.

## పట్టణంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాన కూడళ్ళు, క్యాతనపల్లి రైల్వే గేట్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని, ఇన్సూరెన్స్ లేని, నెంబర్ ప్లేట్ నిబంధనల ప్రకారం లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు లేని 13 బైక్‌లు, 42 చలాన్స్, 01డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. అనంతరం పట్టణ ఎస్సై రాజశేఖర్, సీఐ మాట్లాడుతూ ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించి రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చేసే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, మందమర్రి ఎస్సై చంద్రకుమార్, కాసిపేట ఎస్సై గంగారాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సిర్పూరు ఎమ్మెల్యే హరీష్ బాబును ఘనంగా సన్మానించారు. స్థానిక కాపు సంఘం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హరీష్‌బాబు మాట్లాడుతూ కాపు కులస్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గజ్జల లక్ష్మణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోలెం వెంకటేష్, మాజీ కౌన్సిలర్ దెబ్బటి శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి సి.రవీందర్ కుమార్ అధ్యాపకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో మౌలిక సదుపాయాలతో పాటు కళాశాలకు సంబందించిన రికార్డులు పరిశీలించారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి, విద్య ప్రమాణాలను పెంచడానికి అధ్యాపకులు కృషితో పనిచేయాలని సూచించారు. వారితో పాటు సీనియర్ ప్రిన్సిపల్‌లు జాదవ్ గణేష్ కుమార్, భగవాండ్లు కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కాంబ్లే బాలాజీ, కళాశాల సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా ఫాతిమ బేగం జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్

భారతదేశ మొదటి మైనార్టీ ఉపాధ్యాయురాలు ఫాతిమ బేగం జయంతి వేడుకలను మంగళవారం తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలోని నిమ్న జాతి, స్త్రీ ముస్లింలలో విద్యా వ్యాప్తికై పాటుపడిన ఫాతిమ బేగం, సావిత్రి బాయితో కలిసి బాలికల కోసం మొదటి పాఠశాల ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించారని అన్నారు. ఉర్దూ భాషలో మంచి ప్రావీణ్యం కలిగిన షేక్ ఫాతిమ బేగం, హిందూ, ముస్లిం ఐక్యతకై పోరాడారని అన్నారు. ఎంతో మంది బాలికల విద్యా వ్యాప్తికి ఆదర్శంగా నిలిచిన ఫాతిమ బేగం నేటి యువతి, యువకులకు స్ఫూర్తి అని తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇత్తేహాద్ యువ నాయకులు జుబెర్ ఖాన్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం ఉపేందర్, టీఎస్ఎస్ఓ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడిపెల్లి రాజు, ప్రిన్సిపాల్ అరుణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాట్నాపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పాట్నాపూర్ గ్రామంలోని నూతన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ గ్రామాల్లో వైద్య సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందన్నారు. అలాగే కేంద్రం ప్రజల కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టే ప్రతి ఒక్కరికీ అభివృద్ధి పథకంలో తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పంద్రం సుగుణ, వైస్ ఎంపీపీ లింబాజీ, పీహెచ్‌సీ డాక్టర్ నవీన్‌రెడ్డి, ఓబీసీ అధ్యక్షులు రాజు యాదవ్, డాక్టర్ ప్రియాంక, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, ఏఎస్ఎం ఆశ వర్కర్లు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తునికాకు సేకరణ నిలిపివేసే ఆలోచన మానుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెద్దపులి సంచరిస్తున్నదనే సాకుతో తునికాకు సేకరణ నిలిపివేసే ఆలోచన ఆదివాసుల కడుపు కొట్టడమేనని, ఆ ఆలోచన మానుకొని తునికాకు సేకరణ చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న డిమాండ్ చేశారు. కలెక్టర్ బోర్కడే హేమంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో తునికాకు సేకరణ వ్యవసాయం తర్వాత రెండవ ఆదాయ వనరుగా ఉందన్నారు. జిల్లాలో రెండు అటవీ డివిజన్‌లు ఉన్నాయని, గతంలో ఆసిఫాబాద్‌లో 12యూనిట్లు, కాగజ్‌నగర్ డివిజన్‌లో 13యూనిట్లు ఉండేవన్నారు. అటవీ జంతువులు, ఇతర కారణాలు చూపిస్తూ తెలంగాణరాష్ట్రం ఏర్పాటు నాటి నుండి యూనిట్‌లను తగ్గిస్తూ వచ్చారన్నారు. దీంతో గత సీజన్‌లో ఆసిఫాబాద్‌లో 2యూనిట్లకు, కాగజ్‌నగర్‌లో 13 యూనిట్లకు చివరి నిమిషంలో టెండర్లు పిలవడంతో ఆకు సేకరణ కూడా తగ్గిందన్నారు. ఈ సంవత్సరం కూడా అటవీ అధికారులు పెద్దపులులు సంచరిస్తున్నాయని తునికాకు సేకరణ రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫారసులు చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. జిల్లాలో సీజన్‌లో 30వేల కుటుంబాలు ఆకు సేకరించి ఆదాయం పొందుతున్నాయన్నారు. సేకరణ నిలిపివేస్తే ఆ కుటుంబాలు ఉపాధి కోల్పోతాయని, ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం వస్తుందని, ఆకు సేకరణపై ఆధారపడిన బీడీ పరిశ్రమ కూడా నష్ట పోతుందని అన్నారు. తునికాకు దేశం నుండి విదేశాలకు సైతం ఎగుమతి అవుతుందని, అధికారుల చర్యల వల్ల విదేశీ మారక ద్రవ్యం కూడా మనం కోల్పోతామని తెలిపారు. పెద్దపులి సాకుతో తునికాకు సేకరణ నిలిపి వేయాలనే ఆలోచన విరమించుకోవాలని, తునికాకు టెండర్లు వెంటనే పిలవాలని, ఆకు సేకరణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తిక్ పాల్గొన్నారు.

# అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ సైన్స్ ల్యాబ్ ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్

అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సృజనాత్మకత, తెలుసుకోవాలనే కుతూహలం ప్రేరేపించడం, సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించే విధంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం మొబైల్ సైన్స్ సేవలను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొబైల్ సైన్స్ ల్యాబ్ ఎస్‌జీఓ ద్వారా జిల్లాలోకి రావడం శుభ పరిణామమన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సైన్స్‌లో ఉన్న మెలకువలు తెలుసుకోవడానికి ఇది ఒక మంచి అవకాశమని, దీనికోసం అగస్త్య ఫౌండేషన్ నిరంతరంగా వారి సేవలు జిల్లా స్థాయిలో వినియోగించు కోబోతున్నామని తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన తొమ్మిది పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ద్వారా మొబైల్ సైన్స్ ల్యాబ్ సేవలు 2500 మంది విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని, ఏడాది కాలంలో ఈ ల్యాబ్ ఎంపిక చేయబడిన 9 పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థి దగ్గరికి పదిసార్లు విజిట్ చేసి వారిలో ఉన్న సైన్స్‌లోని మెలకువలను విద్యార్థులకు స్వయంగా ప్రయోగ పూర్వకంగా నేర్పడం జరుగుతుందని పేర్కొన్నారు. మొబైల్ సైన్స్ ల్యాబ్ విద్యార్థుల చెంతకే వచ్చి ప్రయోగాత్మక బోధన ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల మక్కువ పెరుగుతుందని, దీన్ని అందరూ సద్వినియోగ పరచుకోవాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విషయ ఉపాధ్యాయులు అన్ని విషయాల్లో అవగాహన పెంచడానికి చక్కగా కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి ప్రయోగాలపై వారి అనుభవాలను దగ్గరుండి పరిశీలించారు. జిల్లాలోని దిలావర్‌పూర్, సారంగాపూర్, మంజులాపూర్, సోన్ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ సోన్, దిలావర్‌పూర్, జామ్ పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ జనరల్ మేనేజర్ బలరాం, ఏరియా మేనేజర్ శ్రీదేవి, మండల విద్యాధికారి శంకర్, విద్యా శాఖ సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీదేవి, నర్సయ్య, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, టీఎస్ఆర్ఎస్ సోఫినగర్ ప్రిన్సిపాల్ గంగాశంకర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ లతాదేవి, సుజాత, వివిధ సంఘాల బాధ్యులు, జిల్లాలోని అన్ని సబ్జెక్ట్ ఫోరమ్స్ అధ్యక్ష, కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు



# న్యాయ సంహిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



నవతెలంగాణ - రెబ్బెన

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కేంద్ర సంహిత చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నంబాల గేట్ నుండి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ సమీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు మేలు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. కేంద ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన న్యాయ సంసిత చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టంలోని హిట్టు, రన్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం అమల్లోకి వస్తే యాక్సిడెంట్ కేసులు, నేరం రుజువైతే డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.7లక్షల జరిమానా విధిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు మేలు చేయడానికి నాలుగు కోడ్‌లుగా చేసిందని పేర్కొన్నారు. 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, నూతనంగా తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, బీఆర్ఎస్ నాయకులు బొమ్మినేని శ్రీధర్, కుందారపు శంకరమ్మ, జహీరొద్దీన్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ గోలేటి బ్రాంచ్ అధ్యక్షుడు స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షులు లచ్చన్న, కార్యదర్శి బుచ్చన్న, రవి, ప్రసాద్, నాయకులు శ్రీనివాస్, సంతోష్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు



**జైనూర్ :** క్రీడలతో ఆరోగ్యానికి ఎంతో మేలని ఐటీడీఏ ఏపీఓ(పీవీటీజీ) ఆత్రం భాస్కర్, జైనూర్ సీఐ మల్లేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మార్లావాయి గ్రామంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న హైమన్‌డార్ఫ్, బేటీఎలిజబెత్ స్మారక క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాది డార్ఫ్ క్రీడలను స్నేహాభావంతో ఆడుకోవాలని తెలిపారు. ట్రైబల్ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను నిరూపించడానికి ఇలాంటి వేదిక ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఏడాది డార్ఫ్ వర్ధంతి సందర్భంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ లాంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమని డార్ఫ్ యువజన సంఘాన్ని అభినందించారు. ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న డార్ఫ్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. 11న డార్ఫ్ వర్ధంతికి తెలంగాణ పంచాయతీ మంత్రి సీతక్క హాజరుకావడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల స్థానికులు, ప్రజా ప్రతినిధులు, ఆదివాసులు పెద్దఎత్తున కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని హైమన్‌డార్ఫ్, బేటీఎలిజబెత్ యువజన సంఘం అధ్యక్షుడు కనక వెంకటేశ్ అన్నారు. అనంతరం ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో కొబ్బరికాయలు కొట్టి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్, ఉప సర్పంచ్ జుగునాక సావిత్రి ధర్మేందర్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి కదిలిన కార్మికులు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) పిలుపులో భాగంగా వ్యక్తి గత దరఖాస్తులు చేసేందుకు 11 డివిజన్లలోని ప్రగతి భవన్ కు బయలుదేరినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దూలం శ్రీనివాస్, బి.మధు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీసవేతనాల జీవోలను విడుదల చేసి, సంవత్సరాలు గడుస్తున్న నేటికీ వాటిని గెజిట్ చేయకుండా, కాలయాపన చేస్తుందన్నారు. దీనివల్ల కాంట్రాక్టు కార్మికులు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేక ఇచ్చిన జీఓలు అమలు కాక కుటుంబాలను పోషించుకోలేక సతమతమవుతున్నారని పేర్కొన్నారు. కనీసం ఈ ప్రభుత్వమైనా వెంటనే విడుదల చేసిన జీఓ నెంబర్ 22ను గజిట్ చేయాలని, కాంట్రాక్టు కార్మికులు ప్రజావాణిలో వ్యక్తిగత దరఖాస్తులను చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర హైకోర్టు సైతం కనీస వేతనాల జీవోలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిన, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని, కార్మికులు ఎంతో నమ్మకంతో గత ప్రభుత్వాని గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టిందన్నారు. ప్రభుత్వం దానిని గుర్తించి, కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు .

## గిరిజనుల డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-కెరమెరి

గిరిజనుల డిమాండ్లను పరిష్కరించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్ మంగళవారం కలెక్టర్ బొర్కుడే హేమంత్ సహదేవరావును కలిసి వినతిపత్రం అందజేశారు. వచ్చే నెల 15న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి, అధికారికంగా నిర్వహించాలని విన్నవించారు. ఈ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రభుత్వం స్పందించి వెంటనే రూ.10కోట్లు మంజూరు చేయాలన్నారు. గిరిజన చట్టాలను అమలు చేయడానికి ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలన్నారు. తండా అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. జనవరి 11న కొత్తపల్లిలో నిర్వహించ తలపెట్టిన జాతీయ బంజారా దీక్ష భూమి మిలన్ దినోత్సవ జాతరకు జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులను నడపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## వైద్యం అందకనే కార్మికుడు మృతి

నవతెలంగాణ-నస్పూర్

కాసిపేట-2 గనిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడికి కొద్ది రోజుల క్రితం ప్రమాదం జరుగగా సరైన వైద్యం అందించకనే మృతి చెందాడని తెలంగాణ గోదావరిలోయ బొగ్గు కార్మిక సంఘం(ఐఎఫ్టీయూ) రాష్ట్ర నాయకుడు డి బ్రహ్మానందం ప్రకటనలో పేర్కొన్నారు. మచ్చ రమేష్ అనే కార్మికుడు గని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సింగరేణి హాస్పిటల్‌కి వస్తే వారు మెరుగైన వైద్య సౌకర్యం అందించ లేదని అన్నారు. వైద్య పరికరాలను కొనుగోలు చేయడం లేదని,స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించడం లేదని, 17 రోజులుగా వైద్యం పేరుతో హాస్పిటల్లోనే సరైన వైద్యం అందించకనే మృతి చెందడన్నారు. కోట్లాది రూపాయలు పెట్టి హైదరాబాదులో సుమారు 30 కార్పొరేట్ హాస్పిటల్లో సింగరేణి యాజమాన్యం వైద్య సౌకర్యం కల్పిస్తున్నాం అని గొప్పలు చెప్పుకుంటుంది కానీ మచ్చ రమేష్‌ని కార్పొరేట్ హాస్పటల్‌కు ఎందుకు రెఫర్ చేయలేదని, సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తిలో ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలు కాపాడడం లేదని విమర్శించారు. చనిపోయిన మచ్చ రమేష్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్ గ్రేసియా చెల్లించాలని, అతని మరణానికి కారణమైన డాక్టర్లను తక్షణమే సస్పెండ్ చేసి ఇప్పటికైనా సింగరేణి హాస్పిటల లో మెరుగైన వైద్యం అందించే విధంగా సింగరేణి యాజమాన్యం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

## బీజేపీలో చేరిన సినిహీరో

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

సినీహీరో అభినవ్ సర్దార్ మంగళవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆయనకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ జయంత్ అల్లుడైన ఆయన బీజేపీలో చేరడం స్థానికంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. సినీరంగలో రాణిస్తున్న ఆయన బీజేపీ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు పేర్కొన్నారు.

## అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన కంటైనర్

**ఆదిలాబాద్‌టౌన్ :** అదుపు తప్పి ఓ కంటైనర్ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. మంగళవారం గుడిహత్నూర్ నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న ఓ కంటైనర్ మావల హరితవనం పార్క్ ఎదుట జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాద సమయంలో ఇతర వాహనాలేవీ ఆ రోడ్డుపై రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న మావల పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

## ఘనంగా శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**లక్ష్మణచాంద :** మండల కేంద్రంలో శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ దంపతులు శివ లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ రాజు, నాయకులు ఈటెల శ్రీనివాస్, గాండ్ల చిన్నయ్య పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE XI ADDL.CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**A.S.No.14 OF 2022**

**Between:**
Sanjay K.Sajnani -Died per LRs
2.Smt.Vimmy S.Sajnani and others ...Appellants
AND
Kantilal K.Jain and another ...Respondents

To,
1.Suresh Kumar, S/o.Late Siremalji, aged about 55 years, Occ: Business, R/o.Flat No.203, Shivashankar Apartments, H.No. 15-5-106 &106/1, Maharani Jhansi Road Afzal Gunj, Hyderabad. ...Respondent.No.2
2.Smt Raj Kumari Loya, W/o. Rameshwar Loya, aged about 61 years, Occ: House wife. R/o.7-3-4 9, Manganti Complex, Near Post Office, Bellampalli, Adilabad Dist ...Respondent.No.3

WHEREAS the above named Appellants filed the above appeal against the judgment and decree in O.S.No.147 of 2005 passed by the Hon'ble XVII Additional Senior Civil Judge, City Civil Court, Hyderabad, against you and others. The same is posted **to 23-01-2024** for your appearance

Therefore, you are hereby directed to be present your self of through Advocate, positively, the above said Court on the above said date **at 10.30 AM** failing which the matter will be heard and determined in your absence, exparte

**(BY ORDER OF THE COURT)**
Sd/-
**M/s.S.MALLA RAO**
**ADVOCATE**
Unit.No.G-3B,T-19 Towers
Ranigunj,Secunderabad-03
COUNSEL FOR APPELLANTS